క్లుప్తంగా

శుభకార్యం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వైఎస్సార్ సీపీ నాయకులు పెండికంటి ఈరన్న కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి హాజరయ్యారు. ఆదివారం కోసిగిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన వివాహానికి ఎమ్మెల్యే హాజరై నూతన వధువరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, మండల అధ్యక్షులు బెట్టన గౌడ, ఐరన్‌గల్లు శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు,బుళ్లినరసింహులు,జగదీష్‌స్వామి ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

కౌతాళం : మండల కేంద్రం కౌతాళంలో వైఎస్సార్ నగర్ జరిగిన వివాహ వేడుకలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొన్నారు. వైఎస్సాక్ సీపీ నాయకుడు, వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు షేక్షావలి అన్న కుమార్తె వివాహం ఆదివారం జరిగింది. వేడులో ఆయన పాల్గొని నూతన వదువరులను ఆశీర్వదించారు. అయన వెంట వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, సర్పంచ్ పాల్ దినకర్, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, వైస్ సర్పంచ్ తిక్కయ్య, వడ్డే రాము, అబ్దుల్ పమ్మద్, వెంకట్రామి రెడ్డి , తాహేర్‌లు పాల్గొన్నారు.

8న ఎమ్మిగనూరులో జాబ్‌మేళా

గోనెగండ్ల : నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ఎమ్మిగనూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మణిమంజరి ఆదివారం తెలిపారు. పదో తరగ తి నుంచి డిగ్రీ చదివిన వారందరూ అర్హులన్నా రు. ఎమ్మిగనూరులో నిర్వహించే జాబ్ మేళాకు 13 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్ జిరాక్స్ తో పాటు ఫొటో తీసుకొని జాబ్‌మేలాకు వెళ్లాలని తెలిపారు. వయస్సు 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని చెప్పారు. అరులైన నిరుద్యోగ యువతి యువకులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 77994 94856, 96427 35717, 88859 04099 నంబర్లను సంప్రదించాలన్నారు.

రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగికి సన్మానం



ఆర్ఎం బాషాను సత్కరించిన ఉద్యోగులు

ఎమ్మిగనూరు టౌన్: ఆదోని ఆర్టీసీ డిపోలో ఏడీసీ, టీఐ 3గా పనిచేసి పదవీ విరమణ పొందిన ఆర్ఎం బాషాను ఆదివారం పట్టణంలోని ఉర్దూ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆర్టీసీ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యునిటీ అసోసియేషన్ కార్యదర్శి ముస్తక్ అహమ్మద్, ఆదోని డిపో కార్యదర్శి హరిబాబు తదితరులు ఆర్ఎం బాషా సంస్థకు అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు, కర్నూలు1, 2 డిపోలు, పత్తికొండ, ఆదోని డిపోలకు చెందిన ఉద్యోగులు పాల్గొని ఆయనను సత్కరించారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని టౌన్: మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన భార్యాభర్తలు పూజారి ఆదిలక్ష్మి, పూజారి ఈరన్న గత నెలలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వారికి టీడీపీ పార్టీ సభ్యత్వం ఉండడంతో ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.10 లక్షలు ప్రమాదబీమా మంజూరైంది. ఈ మేరకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు మృతుల కుటుంబ సభ్యులకు పరిహారం అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహమ్మద్ జాకీర్ (19 హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఆస్పరి సీఐ మస్తాన్‌వలి తెలిపారు. ఆస్పరిలో ఓ డాబాలో పని చేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు మహమ్మద్ జాకీర్ బైక్‌పై పత్తికొండ వైపు వెళ్తూ పత్తికొండ నుంచి ఆస్పరి వైపు వస్తున్న ఆటోను శనివారం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కోసిగి గ్రామానికి చెందిన కోసిగిమ్మ (50) అక్కడక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన మహమ్మద్ జాకీర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందతూ మృతి చెందినట్లు సీఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దేవరకు వేళాయె!



నాగలదిన్నెలో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి



పెద్దమ్మ తల్లి దేవాలయం



సుంకులమ్మ దేవి దేవాలయం

- 43 ఏళ్ల తర్వాత నాగలదిన్నెలో గ్రామ దేవర
- నేటి నుంచి గ్రామ దేవర ఉత్సవాలు ప్రారంభం
- 7వ తేదీ వరకు కార్యక్రమాలు
- దేవరకు భారీగా ఖర్చు చేస్తున్న గ్రామస్తులు

నందవరం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఊరి దేవరకు నాగలదిన్నె గ్రామం సిద్ధమైంది. అప్పుడెప్పుడో 1982లో ఊరి దేవర నిర్వహించారు.43 ఏళ్ల తర్వాత దేవర సంబురానికి సమాయత్తమైంది. పొలిమేరల్లోని పొలిచల్లి వేదిక కానుంది. గ్రామ దేవర ఉత్స వంతో ఊరాంత సందడిగా మారనుంది.గ్రామ దేవర ఈ నెల 5, 6, 7వ తేదీల్లో నిర్వహించేందుకు గ్రామ పెద్దలునిర్ణయించారు.ఈ మేరకుఇళ్లకు బంధువుల రాక తో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది.

43 ఏళ్ల తర్వాత

తుంగభద్ర నదిని ఆనుకుని నాగలదిన్నె గ్రామం ఉంది. తెలంగాణ సరిహద్దు గ్రామంగా వెలసింది. గ్రామంలో మొత్తం 1,100 వరకు ఇళ్లు ఉన్నాయి. అందులో 800 కుటుంబాలకు పైగా దేవర వేడుక జరుపుకోనున్నారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చనున్నారు. దేవతలకు మొక్కులు తీర్చేందుకు ఉరంతా సరాసరి రూ.2.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు సమాచారం.

గ్రామ దేవతలకు కుంభోత్సవం ఇలా..

గ్రామంలో చిన్నమ్మ, పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ దేవతల ఆలయాలు ఉన్నాయి. ఈ నెల 5, 6, 7న గ్రామ దేవతలకు ఉత్సవం నిర్వహించానున్నారు. 5వ తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, గ్రామ దేవతలకు అభిషేకాలు, మంగళహారతి తదితర పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తీర్థప్రసాదలు వితరణ గావిస్తారు. 6వ తేదీ మంగళవారం ఉదయం ప్రాతఃకాల పూజలు, గ్రామ పొలిమేరల్లో పాలు పొత్తుతో పాటు రాత్రి 11.30 గంటలకు భూత వేషధారణ(భూత్‌పిల్లి)తో పొలిచల్లడం తదితర కార్యక్రమాలు చేపటడతారు. 7న బుధవారం గ్రామ దేవతలకు భక్తులు కుంభోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం నుంచి 3 గంటల వరకు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

దేవరకు అధిక ఖర్చు

43 ఏళ్లకు గ్రామ దేవర నిర్వహిస్తుడడంతో గ్రామ పెద్దలు, గ్రామస్తులు అధిక ఖర్చు వేచ్చిస్తున్నారు. గ్రామ దేవర కావడంతో నైవేద్యాలతో పాటు ప్రతి ఇంటికి బంధుమిత్రులకు విందు ఇచ్చేందుకు బాగానే ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈలెక్కన గ్రామ దేవర ఉత్సవానికి గ్రామం మొత్తం మీద దాదాపు రూ. 3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు ఖర్చు కావచ్చని గ్రామ పెద్దల అంచనా వేస్తున్నారు.

మా ఊరిలో 43 ఏళ్ల తర్వాత దేవర



నా చిన్న వయస్సులో మా ఊరి గ్రామ దేవర జరిగింది. నాకు అంతగా గుర్తు లేదు. మళ్లీ ఇప్పుడు 43 ఏళ్లకు గ్రామంలో గ్రామ దేవర ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. చాలా సంతోషంగా ఉంది. ఈ దేవర నిర్వహించడం వల్ల గ్రామంలో పాడిపంటలుతో సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవిస్తారని నమ్మకం.

– దబ్బా మల్లేష్, నాగలదిన్నె

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



గ్రామ దేవర ప్రశాంతంగా జరుపుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా దేవర ఉత్సవం పూర్తయ్యేలా ప్రజలు సహకారించాలి. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవు. దేవర ఉత్సవం సందర్భంగా వాహనాలకు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సమస్యలు లేకుండా అందరూ సహకారించాలి.

– ఎస్ఐ కేశవ, నందవరం

దేవరలో అల్లర్లకు పాల్పడితే చర్యలు



నాగలదిన్నెలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : గ్రామ దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ఉపేంద్రబాబు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలదిన్నెలో గ్రామ దేవర నిర్వహణపై గ్రామ పెద్దలు, గ్రామస్తులతో రూరల్ సీఐ మధుసూదనరావు నేతృత్వంలో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించే దేవర ఉత్సవంలో గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవర వేడుకలను అందరూ కలిసి కట్టుగా నిర్వహించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కేశవ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టు కొండల్లో కొలువుదీరిన శ్రీ మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం ఆలయ అర్చకులు మల్లయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి గంగపూజ, ఆకు, ఫల, పుష్పాలంకరణ అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా మాతా పరమేశ్వరి జాతర







ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న మాతా పరమేశ్వరిదేవి, అమ్మవారి కథ వినిపిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎంఎం కాలనీలో వెలిసిన మాతా పరమేశ్వరిదేవి 37వ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మారికి గంగపూజ చేసి, సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో మాతా పరమేశ్వరిదేవి, రేణుక ఎల్లమ్మ అమ్మవారి కథలను భక్తులకు క్లుప్తంగా వినిపించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సుబ్బన్న, దండోరా కొండయ్య, రంగస్వామి, చంద్రయ్య, చక్రధారి, బాలాజీ, కాలనీ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

218 మంది చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం



బాలుడికి స్వర్ణామృతప్రాసనం వేస్తున్న దాత ఎన్ఆర్ఐ కాకుబాళ్ నగేష్, అవోపా సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఆదోని ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(అవోపా) వారిచే 11వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. దాత ఎన్ఆర్ఐ కాకుబాళ్ నాగేష్ ఆధ్వర్యంలో చిన్నారులకు మందును పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అపురూప రోగనిరోధక స్వర్ణామృత ప్రాసనం మందులు 218 మంది చినానరులకు అందజేయడం జరిగిందన్నారు. పిల్లలకు ఈ మందు వేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెంచడానికి, మేధా శక్తి, మానసిక ఎదుగుదలను పెంచడానికి దోహద పడుతుందన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సేవ చేయడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. అవోపా ఆదోని పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా మాట్లాడుతూ దాత కాకుబాళ్ నాగేష్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు మెగా వైద్యశిబిరాలు, చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అవోపా ఆదోని పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, ఆదోని పట్టణ అవోపా కార్యదర్శులు రఘు, ఉపాధ్యక్షులు ప్రతాప్, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

తుంగభద్రలోకి చేపల చెరువుల నీరు



కాలువ ద్వారా నదిలోకి వెళ్తున్న చేపల చెరువుల నీరు

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామ సమీపంలో ఉన్న చేపల చెరువుల నీటిని కాల్వల ద్వారా తుంగభద్ర నదిలో కలిపి నీటిని కలుషితం చేస్తున్నారని ఆ గ్రామ ప్రజలు ఆరోపించారు. నది తీర గ్రామాలైన తుంబిగనూరు, నారాయణ పురం గ్రామాల సమీపంలో చేపలు, రొయ్యలు పెంపకం చేసుకునేందుకు చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. చెరువు యజమానులు చేపలు, రొయ్యలు పెంపకానికి అందులో కెమికల్స్, మందులు చల్లుతున్నారు. కొద్ది రోజులు తర్వాత చెరువులోని నీటిని మార్చేందుకు నీటిని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని అక్కడే ఇంకిపోయేలా చూడాల్సి ఉంది. కానీ అక్కడి యాజమానులు మాత్రం అందుకు విరుద్ధంగా ఆ నీటిని పక్కనే ఉన్న తుంగభద్ర నదిలోకి మళ్లిస్తున్నారు. ఆ నీరు తుంగభద్ర నదిలో కలిసి కలుషితం అవుతోంది. కలుషితమైన నదినీటిని సాతనూరు ఎస్‌ఎస్‌పీ స్కీమ్ నుంచి తాగునీటి అవసరాలకు సరఫరా చేస్తున్నారు. ఆ నీటిని తాగడం వలన అనారోగ్యాలకు గురి కావాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని చేపల చెరువుల నీటిని నదిలోకి విడుదల చేయకుండా, నీరు కలుషితం కాకుండా చూడాలని ప్రజలు కోరారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేస్తున్న ఉప్పర సగర సంఘం నాయకులు



పట్టణంలో భగీరథ మహర్షి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఉప్పర సగర సంఘ సభ్యులు



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు,బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేస్తున్న ఉప్పర సగర సంఘ నాయకులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని సిద్దప్ప పాళెంలో ఊరువాకిలిలోని సూగూరేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఉప్పర కులబాంధవుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు ఈరన్న , కృష్ణ, మానస మెడికల్ షాప్ బసవరాజు మాట్లాడుతూ ఉప్పర కులస్తులు ఐక్యమత్యంగా ఉంటూ అన్నీ రంగాల్లో రాణించాలన్నారు. అలాగే ప్రభుత్వం ఉప్పర కులస్తులను ప్రస్తుతం బీసీడీ నుంచి బీసీ ఏ క్యాటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు గుర్రం వీరేష్, లక్ష్మన్న, శివ, బసవరాజు, చిన్న హుసేన్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతిని ఉప్పర సగర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఆలయంలో భగీరథ మహర్షికి ప్రత్యేక పూజలు చేసి, ఉప్పర సగర కళ్యాణ మండపంలోని మహర్షి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అంతకుమునుపు భగీరథ మహర్షి చిత్రపటంతో పట్టణ ప్రధాన వీధులో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉప్పర సగర సంఘ నాయకులు బంగి శ్రీరామ్, వీరేంద్ర, యయు నాగేష్, కోటకొండ నరసింహులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘం సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగింది. సమావేశంలో ప్రముఖ రంగస్థల కళాకారులైన లొద్దిపల్లె అల్లాబకాష్, ఎన్టీఆర్ అవార్డు గ్రహీతలు బీసీ కృష్ణ, ఎస్.శ్రీనివాసులు చిత్రపటాలను తెలుగు వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి, సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య ఆవిష్కరించారు. అంకయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పార్క్‌గా మార్చడంతో కళాకారుల ప్రదర్శనలకు వేదిక లేకుండా పోయిందన్నారు. కళాకారులు ఐక్యంగా ఉండి కళా వేదికను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు పొందిన సంగీత విద్వాంసులు డాక్టర్ భగవాన్ ప్రకాష్ బాబును సన్మానించారు. కళాకారులు దస్తగిరి, కళాప్రియ తిరుపాలు, బైలుప్పల షఫీ, డాక్టర్ సభాన్, వీవీ రమణారెడ్డి, హనుమంతరావు చౌదరి, సయ్యద్ రోషనలి, సీబీ అజయ్ కుమార్, టీ రాజశేఖర్‌రావు, గోవిందరాజులు, పార్వతయ్య, అరుణ కుమారి, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

పత్తికొండ రూరల్ : మండలంలోని కనకదిన్నె గ్రామంలో బహిర్భూమికి వెళ్లి ఇంటికి వస్తున్న ఉప్పర చిన్న రంగన్నను ఆదివారం దేవనకొండ–పత్తికొండకు కూరగాయల లోడుతో వెళ్తున్న అలారుదిన్నె గ్రామానికి చెందిన ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కర్నూలుకు తీసుకెళ్లారు.

ఘనంగా ముద్దురంగా గురువుల ఆరాధన



పూజలు అందుకుంటున్న ముద్దురంగాగురుస్వాములు

పెద్దకడబూరు : పెద్దకడబూరు మండల కేంద్రంలో వెలసిన ఘనగురు దత్తాత్రేయ సంప్రదాయ వంశపరంపర గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన శ్రీముద్దురంగా గురువుల 140వ గురుపూజ ఆరాధన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గంజహల్లి వెంకటాగురువుల మఠం అధ్యక్షుడు కృష్ణమూర్తిస్వామిఆశీర్వాదములతో వైశాఖ శుద్ధ అష్టమి ఆదివారం రాత్రి గురుపూజ, మంగళహారతులు, తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం రాత్రి చేపట్టిన భజన కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నేడు పుణ్య గణారాధన

సోమవారం ఉదయం ముద్దురంగా గురు స్వామికి మఠం పీఠాధిపతులు వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు వంటి ప్రత్యేక పూజలు చేపడుతారు. సాయంత్రం స్వామివారి పుణ్యగణారాధన, పల్లకీసేవ, నందికోలసేవ, గురువుల విచరణ ప్రవచనం అనంతరం అఖండ భజన కార్యక్రమాలతో స్వామివారి మేలుకొలుపు జరుగుతుందని నిర్వాహకులు మఠం రంగప్పస్వామి, శాంతమూర్తిస్వామి, బ్రంహ్మేంద్రస్వామి తెలిపారు.

గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు



అ‘పూర్వ’ కలయిక

మంత్రాలయం : మండల పరిధిలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005విద్యాసంవత్సం 10వ తరగతి చదివిన విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలిశారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అందరూ కలిసి చదువులు చెప్పిన గురువులు రిటైర్డ్ హెచ్ఎం ముక్కరన్న , సి.బెళగల్ ఎంఈఓ ఆదాం బాషా, ఎమ్మిగనూరు బాలికల పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి, బనగానపల్లె టంగుటూరి హెచ్ఎం పర్వీన్ బానులను శాలువా పూలమాలలతో సన్మానించారు. 20 ఏళ్ల తర్వాత కలువడంతో ఒకరినికొకరు కలుసుకుని ఆనందం పంచుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమృత ఫలం.. విషతుల్యం!

- కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్ల విక్రయాలు
- పసుపు రంగుతో నిగనిగలాడుతూ ఆకర్షిస్తున్న వైనం
- సహజసిద్ధంగా మాగబెట్టిన మామిడి పండ్లు కరువు



పట్టణంలో తోపుడు బండ్లపై విక్రయానికి ఉంచిన మామిడి పండ్లు

ఎమ్మిగనూరుటౌన్: ఫలాల్లో రారాజు మామిడి.. వేసవి వచ్చిందంటే చాలు మామిడి పండ్ల కోసం ఎదురుచూడని వారుండరంటే అతిశయోక్తి కాదు. అలాంటి మామిడి పండు విషతుల్యంగా మారుతోంది. గతంలో మామిడి పండ్లను సహజంగా పక్వానికి తీసుకొచ్చి మార్కెట్‌లలో విక్రయించే వారు. ప్రస్తుతం వ్యాపారులు మామిడి కాయలను నిషేధిత కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి కృత్రిమంగా మాగబెడుతున్నారు. ఇది ప్రజల ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినా.. తమ వ్యాపారం కోసం రసాయనికంగా మాగబెడుతున్నా సంబంధిత ప్రజారోగ్య శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

ప్రస్తుతం పట్టణంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లే కనిపిస్తున్నాయి. కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. అయితే పచ్చగాను, పసుపు పచ్చని రంగులో నిగనిగలాడుతూ కనిపించే మామిడి పండ్లను చూసి సహజంగా మగ్గించినవి అనుకుంటే పప్పులో కాలేసినట్లే. మామిడి కాయలను ప్రమాదకరమైన, ఆరోగ్యానికి హాని కల్పించే కాల్షియం కార్బైడ్ వినియోగించి మగ్గిస్తున్నారు. కోడుమూరు, వెల్దుర్తి, కర్నూలు, అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి హోల్‌సెల్ వ్యాపారులు తెచ్చి కృత్రిమంగా మగ్గబెట్టి కొందరు విక్రయిస్తుండగా.. మరి కొందరు అక్కడే రసాయనాలతో మాగబెట్టిన పండ్లను తెచ్చి స్థానిక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కాల్షియం కార్బైడ్ వినియోగాన్ని 2012సంవత్సరంలోనే రాష్ట్రంలో నిషేధించారు.

మెరిసేవన్నీ మంచివి కావు..

కార్బైడ్ వంటి రసాయనాలతో మామిడి కాయలను మగబెడితే అవి త్వరగా మాగడంతో పాటు పండు పైన పసుపు రంగుతో నిగనిగలాడుతుంటాయని, రుచిలో చప్పగా వుంటాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా పండ్లు పక్వానికి వచినప్పుడు ఉత్పత్తయ్యే ఇథిలిన్‌తో మగ్గుతాయి. అలా పండిన పండ్లు రంగు, రుచి, సువాసనతో ఆరోగ్యదాయకంగా ఉంటాయి. సహజ సిద్ధంగా మాగబెట్టిన మామిడి పండ్లు తియ్యగాను ఉంటాయి. అలాగే నీటిలో వేస్తే పూర్తిగా మునుగుతాయి. రసాయనాలతో మాగబెట్టిన మామిడి పండ్లు నీళ్లలో మునగవు.. కాస్త తేలుతూ ఉంటాయి. ఇలాంటి వాటిని నీటిలో కనీసం ఒక గంటపైగా నానబెడితే వాటిపై వున్న రసాయన ప్రభావం కొంతైనా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. .

అరోగ్యంపై తీవ్రప్రభావం



మామిడి పండ్లు తింటే ఆరోగ్యానికి మంచిదే. కానీ మామిడి కాయలను కృత్రిమంగా మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ వంటి తదితర రసాయన మందులు, స్ప్రేలు ఉపయోగించడం వల్ల ప్రజలపై తీవ్ర ఆరోగ్య ప్రభావం చూపుతుంది. తద్వార అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రధానంగా జీర్ణకోశ వ్యాధులు, నాడి వ్యవస్థపై దుష్ప్రభావం తదితర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం వుంది.

– డాక్టర్ బాలాజీకుమార్, ఎమ్మిగనూరు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహించి ప్రజలను ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.